డిగ్రీ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి డా.బ్రిజేష్

డా.బ్రిజేష్

నేరేడ్‌మెట్, డిసెంబర్ 25: తెలంగాణ డిగ్రీ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డా.బ్రిజేష్, ఉపాధ్యక్షులుగా డా.జి. ఎన్ జగన్ ఎన్నికయ్యారు. బుధవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ క్లబ్‌లో జరిగిన తెలంగాణ డిగ్రీ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ ఎన్నికల్లోఎన్నుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు మాట్లాడుతూ మల్కాజిగిరి కళాశాల నుంచి టీజీసీటీఏకి ఇద్దరు అభ్యర్థులు ఎన్నికవ్వడం సంతోషంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

భవన నిర్మాణదారులను బెదిరించిన వ్యక్తి అరెస్ట్

మియాపూర్ , డిసెంబరు 25: కేపీహెచ్‌బీ కాలనీ ఏడో ఫేజ్‌లో డబ్బులు ఇవ్వాలని బిల్డర్లను బెదిరిస్తున్న జంగాల నాగార్జునను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేపీహెచ్‌బీ పోలీసులు బుధవారం తెలిపారు. సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌కాలనీ ఏడో ఫేజ్ ప్లాట్ నంబర్ 43లో భవన నిర్మాణ పనులు చేస్తున్న నిర్మాణదారుడిని డబ్బులు ఇవ్వాలని జంగాల నాగార్జున, బత్తిని సుమన్‌గౌడ్ బెదిరించగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో నాగార్జునను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిర్మాణదారులను బెదిరింపులకు గురి చేసే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువడుడు మృతి

కీసర, డిసెంబర్ 25: రోడ్డు ప్రమాదంలో యువడుడు మృతిచెందాడు. ఈ ఘటన కీసర పోలీస్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..నాగారం మున్సిపాల్టీ పరిధిలోని రాంపల్లి గ్రామానికి చెందిన అంకర్ల శివకుమార్ ముదిరాజ్(29) ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకొని రాంపల్లి నుంచి చర్లపల్లికి వెళ్లే రోడ్డు మార్గంలో బైక్‌పై వస్తున్నాడు. ఆ మార్గంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన మట్టి కుప్పలు ఉండటంతో చీకట్లో కన్పించకపోవడంతో బైక్‌పై వస్తున్న శివకుమార్ ప్రమాదవశత్తు కింద పడిపోయి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే పడి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొన్నారు. మృతుడికి తొమ్మిది నెలల క్రితం వివాహం జరిగింది.

రెడీ టు సర్వ్ ఆధ్వర్యంలో అన్నదానం

ఆర్కేపురం, డిసెంబర్ 25: ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అని రెడీ టు సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్ అన్నారు. నరసింహ అనురాధ కుమారుడు శరత్‌వంశీ జయంతి సందర్భంగా ఓల్డేజ్ హోమ్‌లో అన్నదానం చేశారు.

గౌతంనగర్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్, తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీలోని గ్రేస్ చర్చిలో వేడుకల్లో పాల్గొన్న డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ వెంకటేశ్వర్‌రావు

స్కందానగర్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, తదితరులు

క్రీస్తుతత్వం.. భక్తజన తన్మయత్వం

అట్టహాసంగా క్రిస్మస్ వేడుకలు.. ఆకట్టుకున్న క్రీస్తు నాటకం

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు.. చర్చిలకు పోటెత్తిన క్రైస్తవులు

విశ్వ మానవాళిపై అనంత ప్రేమ చాటి.. కరుణామయుడిగా పేరొంది.. సహనానికి ప్రతిరూపంగా నిలిచిన ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా బుధవారం నగరంలోని క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిలకు భక్తులు భారీగా వచ్చి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపేలా పలుచోట్ల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తిగీతాలాపనలు.. శాంతి సందేశాలు.. కేక్ కటింగ్‌లు.. పరస్పర శుభాకాంక్షలతో అంతటా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

దుండిగల్, డిసెంబర్ 25: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో బుధవారం క్రిస్మస్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాంతికి నిలయమైన ఏసుప్రభువు చూపిన మార్గంలో అందరు నడవాలని పలువురు సూచించారు. సూరారం డివిజన్ పరిధిలోని స్కందానగర్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, చర్చి గాగిళ్లాపూర్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు జరిపిన అనంతరం కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

శాంతిదూత.. కరుణాప్రదాత..

మియాపూర్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలోని పలు చర్చిలను బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా చర్చిల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. వేడుకల్లో పాల్గొని క్రిస్టియన్లకు డీసీపీ శుభాకాంక్షలు తెలిపారు. డీసీపీ వెంట కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి సతీశ్‌రావు డివిజన్‌లోని గాడ్స్ టెంపుల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కాగా కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని గ్రేస్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ నేత నందమూరి సుహానికి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ జార్జ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయం..

మూసాపేట: ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శమమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. గౌతమ్‌నగర్, శివశంకర్ నగర్ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు డేవిడ్, శాంతకుమార్, జాన్‌పాల్, పాపారాయుడు, బాగయ్య పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం..

క్రీస్తు చూపిన ప్రేమ, క్షమాపణ, దయాగుణాన్ని అలవర్చుకొని అభాగ్యులకు చేయూతనిచ్చేలా కృషి చేయాలని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధి జనతానగర్ అపోస్టిలిక్ చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా శ్రావణ్‌కుమార్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ శాంసన్, రవిసింగ్, విష్ణు, రాజు, అరుణ్, రాము, డేవిడ్, సంజయ్, అబ్బాస్, శ్యామల పాల్గొన్నారు.

ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్‌లో..

దుండిగల్: సూరారం డివిజన్ శ్రీరాంనగర్‌లోని ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శిరీశ్ తుర్లపాటి, స్కూల్ ప్రిన్సిపాల్ డా.తులసి కుమారి, ఆపరేషన్ హెడ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను అకట్టుకున్నాయి. చిన్నారులకు బహుమతులు అందజేశారు.

జనతానగర్ న్యూ అపోస్టిలిక్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న తూము శ్రావణ్‌కుమార్

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో గాడ్స్ టెంపుల్‌లో బీఆర్ఎస్ నేత సతీశ్‌రావు

కేపీహెచ్‌బీలో గ్రేస్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేత సుహాసిని

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, డిసెంబర్ 25: ఆలిండియా క్రాఫ్ట్స్ మేళాలో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనల్లో పలువురి నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బుధవారం కూచిపూడి, ఒడిస్సీ, పురూలియా చౌ నృత్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, సుస్మితా మిశ్ర శిష్య బృందం ప్రదర్శించిన ఒడిస్సీ నృత్యాలు, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ ఆధ్వర్యంలో రూప్ చంద్ బృందం ప్రదర్శించిన పురూలియా చౌ నృత్యాలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి.

చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తా


ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు సురేశ్‌యాదవ్, చిరు వ్యాపారులు

బేగంపేట్, డిసెంబర్ 25: బేగంపేట్ డివిజన్‌లో ట్రాఫిక్ పోలీసులు విధిస్తున్న ఆంక్షల వల్ల తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని చిరు వ్యాపారులు పేర్కొన్నారు. ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించాలని కోరారు. ఈ మేరకు చిరు వ్యాపారులంతా బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేశ్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన బుధవారం వారితో కలిసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిశారు. వారి ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. పోలీసు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కృష్ణారావు హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు.

సామాజిక చైతన్యానికి మాలపల్లి బాటలు

సంస్మరణ సభలో మాట్లాడుతున్న తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాశేశ్వరం శంకరం

ముషీరాబాద్, డిసెంబర్ 25: వంద ఏళ్ల క్రితమే మాలపల్లి నవల రాసి సమాజంలో రుగ్మతలను ఎండగట్టిన ఉన్నవ లక్ష్మీనారాయణ సామాజిక చైతన్యానికి బాటలు వేశారని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాశేశ్వరం శంకరం అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో ఉన్నవ లక్ష్మీనారాయణ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఉన్నవ లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు నవలా సాహిత్యంలో ఉన్నవ లక్ష్మీనారాయణది ప్రత్యేక స్థానం అని అభివర్ణించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ కవుల సంఘం అధ్యక్షుడు సుతారపు వెంకటనారాయణ, ఎస్‌బీ రామ్, మిద్దె సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి


12వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 25: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోరారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ 12వ వార్డులో రూ. 10 లక్షల నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను, రూ. 18 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు కేటాయించి పనులు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్, వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి కౌన్సిలర్లు అనురాధ యాదగిరి గౌడ్, రమేష్ గౌడ్, వెంకటేష్, సరిత, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతోనే ఆరోగ్య తెలంగాణ సాధ్యం


పిట్టల ఆర్గానిక్ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 25: సేంద్రియ వ్యవసాయంతోనే ఆరోగ్య తెలంగాణ సాధ్యం అవుతుందని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్‌లోని పిట్టల ఆర్గానిక్ ఫామ్‌ను జిల్లా రైతు సమన్వయ సహకార సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. భవిష్యత్ తరాలకు సంప్రదాయ వ్యవసాయ ఉత్పత్తులను అందించాలనే సంకల్పంతో పిట్టల శ్రీశైలం, కృష్ణవేణి దంపతులు నాడు ప్రత్యేక తెలంగాణ కోసం కొట్లాడినట్లుగానే నేడు ఆరోగ్య తెలంగాణ కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. ఫామ్ సందర్శించిన వారిలో రైతులు పాల్గొన్నారు.

బొమ్మ తుపాకీతో హల్ చల్

నిజాంపేట్ కేటీఆర్ కాలనీలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

దుండిగల్, డిసెంబర్ 25: బొమ్మతుపాకీతో నలుగురు విద్యార్థులు నిజాంపేట్‌లోని కేటీఆర్ కాలనీలో హంగామా సృష్టించగా, స్థానికుల నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు సదరు విద్యార్థులను బైండోవర్ చేసిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్‌లోని కేటీఆర్ కాలనీలో ఈనెల 13వ తేదీన అర్ధరాత్రి 11.30 గంటల ప్రాంతంలో బాచుపల్లి డాలర్‌మిడోస్‌కు చెందిన ముప్పిడి విశాల్‌రెడ్డి, నిజాంపేట్ కేటీఆర్ కాలనీలోని శ్రీసాయిద్వారక హైట్స్‌లో నివాసముంటున్న రావూరి చరణ్(19), పటాన్‌చెరువులోని ఏపీఆర్ గ్రాండియర్‌లో నివాసముంటున్న దంతులూరి కౌశిక్‌వర్మ(19), బాచుపల్లి హరితవనం కాలనీ, పద్మావతి ఫ్లైడ్‌లో నివాసముండే కేతిరెడ్డి కౌశిక్‌రెడ్డి(21) ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. కాగా ఈనెల 13న అర్ధరాత్రి 11.30 గంటల ప్రాంతంలో నిజాంపేట్‌లోని కేటీఆర్ కాలనీలో బొమ్మతుపాకీతో హంగామా సృష్టించారు. సదరు విద్యార్థులు వాహనాలపై వీధుల్లో తిరుగుతూ.. తుపాకీతో కాల్చుతున్నట్లు ప్రవర్తించారు. దీంతో బయాందోళనకు గురైన స్థానికులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థులు వాడింది బొమ్మ తుపాకీ.. సినిమా షూటింగ్‌ల్లో వాడేదిగా గుర్తించారు. కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేయడంతో వారిపై కేసు నమోదు చేయడంతో పాటు సదరు తుపాకీని సీజ్ చేశారు. అనంతరం విద్యార్థులను బాచుపల్లి తాసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. కాగా పక్షం రోజులుగా విషయాన్ని వెలుగులోకి రాకుండా ప్రయత్నించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

గుర్తు తెలియని మహిళ మృతి

కాప్ర డిసెంబర్ 25 : గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసు కుంది. పోలీసుల కథనం ప్రకారం.. కుషాయిగూడ వెంకటేశ్వ రస్వామి ఆలయం పక్కలైన్‌లో గుర్తు తెలియని మహిళ శాంత మ్మ(45)ఉందని సమాచారం తెలియడంతో పోలీసులు ఆమె ను గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడే చికిత్స చేయిం చారు. డిశార్జు అయిన తరువాత ఆమె చక్రీపురం ఓల్డ్ ఏజ్ హోంలో చేర్పించారు. అక్కడ ఆమె అనారోగ్యంతో మంగళ వారం మృతిచెందినట్లు తెలిపారు.తెలుగు భాష మాట్లాడు తుంది. మతిస్థిమితం సరిగా లేదన్నారు.శవపరీక్ష నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 25: ఘట్‌కేసర్ పట్టణంలో బ్రిడ్జి నిర్మాణంతో పాటు వాహనాల రాకపోకలకు గాను రోడ్డు విస్తరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా భూ బాధితులకు నష్టపరిహారం త్వరలో చెల్లిస్తామన్న హామీతో పూర్తి చేసిన కూల్చివేతలను బుధవారం ఆమె పరిశీలించారు. ఇండ్లు, వాణిజ్య సముదాయాలు కూల్చివేయటంతో రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించారు. పూర్తి స్థాయిలో రోడ్డు విస్తరణ జరిగిన తర్వాత బ్రిడ్జి పనుల వేగవంతం కావటంతో పాటు భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. పట్టణంలోని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల పునరుద్ధరణ చేపడుతామన్నారు.

నేడు మాదిగ దండోరా కార్యవర్గ సమావేశం

నేరేడ్‌మెట్, డిసెంబర్ 25: మాదిగ దండోరా కార్యవర్గ సమావేశం గురువారం అల్వాల్ శుభశ్రీ గార్డెన్‌లో జరగనున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని తమ కార్యాలయంలో వారు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు జరిగే మాదిగ దండోరా కార్యవర్గ సమావేశానికి తనవంతుగా భోజనాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమానికి అండగా ఉండి భోజన ఏర్పాట్లు చేస్తున్నందుకుగాను కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోనాయకులు,కార్యకర్తలు ఉన్నారు.